క్లుప్తంగా

ప్రకృతి వైపరీత్యాల నిధి ద్వారా ఆర్థిక సాయం



బాన్సువాడ రూరల్: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు చెరువులో మునిగి మృతి చెందిన తాడ్కోల్ గ్రామానికి చెందిన బక్కని సాయిలు కుటుంబానికి ప్రకృతి వైపరీత్యాల నిధి ద్వారా మంజూరైన చెక్కును ఆదివారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి రూ.4లక్షలు మంజూరు చేయించిన స్పీకర్‌కు తాడ్కోల్ గ్రామ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా రైతు బంధు అధ్యక్షులు అంజిరెడ్డి, తాడ్కోల్ సొసైటీ చైర్మన్ గంగారాం, సర్పంచ్ కుమ్మరి రాజమణి రాజు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బాధితురాలికి ..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజీవాడి గ్రామంలో ఆదివారం బాధితురాలికి బీజేపీ నాయకులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇటీవల గ్రామానికి చెందిన కుమ్మరి వీరచారి అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో రూ.10 వేలు అందించారు. నాయకులు చిన్న గంగారెడ్డి, తిరుపతిరెడ్డి, రామరాజు, సంజీవరెడ్డి, రమణారెడ్డి, సీహెచ్ రాజయ్య, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని దాల్మల్‌గుట్టలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాలరాజు ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. పెన్షన్‌ను రూ.4వేలకు పెంచడంతో పాటు ఇళ్లు లేని వారికి రూ.5లక్షల సాయం అందిస్తామన్నారు. మండల అధ్యక్షుడు మంత్రి గణేష్, నార్ల రఘు, శ్రీనివాస్, గుడాల నగేష్, సాయిలు, కొట్టం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం



రాజంపేట: అన్నారం తండాలో సీజనల్ వ్యాధులు ప్రబలడంతో ఆదివారం సైతం ప్రత్యేక శిబిరాన్ని కొనసాగించారు. ఆదివారం సుమారు 65 మంది వైద్య పరీక్షలు నిర్వహించగా.. ఇందులో 44 మందికి రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. వీరిలో ఒకరికి డెంగీ నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. పలువురికి మందులు అందజేశారు. వైద్యులు వినయ్, సింధు, లక్ష్మి, కమల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీని గెలిపించాలని తీర్మానం



కామారెడ్డి రూరల్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్న మహమ్మద్ అలీ షబ్బీర్‌కు అందరం కలిసి ఓటు వేస్తామని కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆయన గెలుపు కోసం అందరం కలిసికట్టుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. నాయకులు బంబోతుల కుమార్ గౌడ్, మోతే స్వామి గౌడ్, పిప్పరి లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు

స్వీపర్ల రిలే దీక్షలు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 63వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీ చాలని వేతనాలతో పని చేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించకపోవడం శోచనీయమన్నారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

- కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే బీవీ హరీశ్
- లింగంపేటలో కాషాయ శ్రేణుల భారీ ర్యాలీ



లింగంపేటలో ర్యాలీ తీస్తున్న బీజేపీ శ్రేణులు



లింగంపేటలో మాట్లాడుతున్న కర్ణాటకకు చెందిన ఎమ్మెల్యే బీవీ హరీశ్

లింగంపేట(ఎల్లారెడ్డి): తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమైందని కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే బీవీ హరీశ్ జోస్యం చెప్పారు. ఆదివారం ఆయన లింగంపేట మండల కేంద్రం సమీపంలోని డీపీఎల్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ప్రవాస్ యోజన వర్క్ షాపులో మాట్లాడారు. బీజేపీ అభ్యర్థులు 70 స్థానాలకుపైగా గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్‌పై ప్రజలకు విశ్వాసం పోయిందన్నారు. బీఆర్ఎస్ నాయకులే ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. టీఎస్‌పీఎస్సీలో అక్రమాలు జరిగినా ప్రభుత్వం పట్టించుకోకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం పట్ల రైతులు, నిరుద్యోగులు, యువత, విద్యార్థులు, కూలీలు, పేదలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప నేత మోదీ అని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కార్యకర్తలు ఇంటింటికి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఎల్లారెడ్డిలో బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో బైక్ ర్యాలీ తీశారు. మండల పార్టీ అధ్యక్షుడు దత్తురాం, కార్యదర్శి రాంచందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి రాంరెడ్డి, పైలా కృష్ణారెడ్డి, పోతంగల్ కిషన్ రావు, బాపురెడ్డి, పోచన్న, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌పై నమ్మకం పోయింది'



మద్నూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే అజయ్ కుమార్ రాయ్, పక్కన అరుణ తార

మద్నూర్(జుక్కల్): ప్రజల్లో బీఆర్ఎస్‌పై నమ్మకం పోయిందని అసోం బీజేపీ ఎమ్మెల్యే అజయ్ కుమార్ రాయ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మైథిలి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీజేపీ ప్రవాస్ యోజన వర్క్ షాప్ చివరి రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే అజయ్ కుమార్ రాయ్ మాట్లాడారు. ప్రతి బీజేపీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీలో కేవలం కుటుంబ పాలన కొనసాగుతుందని, కేసీఆర్ కుటుంబమే బంగారు కుటుంబంగా తయారైందని ఆరోపించారు. బీజేపీ అందిస్తున్న నిధులతోనే కేసీఆర్ నెట్టుకొస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ పథకాల పేర్లు మార్చి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం సిగ్గు చేటన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార, నాయకులు ప్రకాశ్ నాయుడు, మండల అధ్యక్షుడు హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

టికెట్ ఇవ్వకుంటే బీఆర్ఎస్‌కు ఓటెయ్యం



తిప్పాపూర్‌లో సమావేశమైన ముదిరాజ్ నేతలు

భిక్కనూరు: రాష్ట్రంలో 60 లక్షల ముదిరాజుల జనాభా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ పార్టీ ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా ప్రకటించకపోవడం శోచనీయమని తిప్పాపూర్ ముదిరాజు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామంలోని పెద్దమ్మ ఆలయం వద్ద ముదిరాజు సంఘం సభ్యులు సమావేశమై మాట్లాడారు. తమకు జనాభా ప్రాతిపదికన బీఆర్ఎస్ సీట్లను కేటాయించాలన్నారు. తమను ఓటర్లుగానే గుర్తిసుందే తప్ప నాయకులుగా ఎదగనివ్వడం లేదని అన్నారు. సీట్లను కేటాయించకుంటే బీఆర్ఎస్‌కు ఓటేసే ప్రసక్తే లేదని తీర్మానం చేశారు. సంఘం అధ్యక్షుడు కొండ సాయిలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఓటు వేసే యంత్రాలుగా ముదిరాజ్‌లు'

బాన్సువాడ:పాలకులు ముదిరాజ్‌లను కేవలం ఓటువేసే యంత్రంగానే చూస్తూ, రాజ్యాధికారానికి దూరం చేస్తున్నారని సీపీఐ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు అన్నారు. బాన్సువాడలో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు రాజకీయంగా,ఆర్థికంగా,సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వాలు మారి నా ముదిరాజ్‌ల తలరాత మారడం లేదన్నారు. అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించే విషయంలో ముదిరాజ్‌ల పట్ల వివక్ష చూపుతున్నారన్నారు. ముదిరాజ్ ప్రతినిధులు గోపాల్, కాశీరాం పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాల ఎన్నిక

మున్నూరుకాపు సంఘం..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా మల్లోడ్డి సంజీవులు(జప్తిజాన్కంపల్లి), ఉపాధ్యక్షులుగా ధనుంజయ్(బొల్లారం), బిట్ల శ్రీనివాస్(గోలిలింగాల), ప్రధాన కార్యదర్శిగా గాజుల గోపాల్(తాండూర్), కార్యదర్శిగా నాయికోటి రవి(మాల్తుమ్మెద), కోశాధికారిగా ఆకుల సంజీవులు(గోపాల్‌పేట), సలహాదారులుగా కాశీ నారాయణ(ఏర్రారం), రాపర్తి యాదగిరి (ఏర్రారం), తదితరులను ఎన్నుకున్నారు.

ఆర్యవైశ్య కార్యవర్గం..



రాజంపేట: రాజంపేట గ్రామ నూతన ఆర్యవైశ్య కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామ ఆర్యవైశ్య సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా ముత్యపు సిద్ధరాములు, ఉపాధ్యక్షుడిగా మెలుగు చంద్రమౌళి, కార్యదర్శిగా మొగిలిపల్లి రమేష్ గుప్తా, కోశాధికారిగా బంధం పద్మారావ్, కార్యవర్గ సభ్యులుగా బంధం అనిల్ గుప్తా, చింతల మల్లేశం, బచ్చు శ్రీనివాస్, సలహాదారులుగా కొండ సురేందర్, బంధం కృష్ణమూర్తి, బంధం మల్లేశం, తాటి రమేష్ గుప్తా, ముత్యపు చక్రపాణిలు ఎన్నికయ్యారు.

పిట్లం లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ కరీం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో లారీ ఓనర్స్ సమక్షంలో ఆదివారం పిట్లం లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ కరీం, సెక్రటరీగా గోపి నాయక్, ఉపాధ్యక్షుడిగా నవీన్, క్యాషియర్‌గా మీర్జా ఆసిఫ్ బేగ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు షేక్ కరీంను ఎమ్మెల్యే హన్మంత్ సింధే శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముదాం రమేష్

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముదాం రమేశ్‌ను మాజీ మంత్రి షబ్బీర్ అలీ నియమించారు. అలాగే ఉపాధ్యక్షుడిగా పంపరి లక్ష్మణ్‌ను నియమించారు.అసెంబ్లీఎన్నికల్లో షబ్బీర్ అలీ గెలుపు కోసం కృషి చేస్తామని వారు అన్నారు.

'మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం'



మాట్లాడుతున్న సబ్బని లత

కామారెడ్డి టౌన్: మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని బహుజన మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పూలే అంబేడ్కర్ కాలనీలో జరిగిన జిల్లా జోనల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా లోకం, పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం బహుజన మహిళా సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా గంగామణి, ప్రధాన కార్యదర్శిగా శ్యామల, కోశాధికారిగా మాల, ఉపాధ్యక్షురాలుగా అవుసుల లక్ష్మి, సెనాజ్, భారతి, సహాయ కార్యదర్శులుగా స్వప్న, శాంత, రాధ, తదితరులు ఎన్నికయ్యారు.

కోకాపేట తరలిన పెరిక సంఘం ప్రతినిధులు



దోమకొండ నుంచి వెళ్తున్న సంఘం ప్రతినిధులు

దోమకొండ: హైదరాబాద్‌లోని కోకాపేటలో ఆదివారం పెరిక సంఘం రాష్ట్ర భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి దోమకొండ మండలానికి చెందిన పెరిక సంఘం నాయకులు వాహనాల్లో తరలి వెళ్లారు. సంఘం రాష్ట్ర భవనానికి సీఎం కేసీఆర్ 2 ఎకరాల భూమి కేటాయించగా, భవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుంచాల శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్ల భాస్కర్,తదితరులు తరలి వెళ్లారు.

త్రిలింగేశ్వరాలయంలో డీఆర్‌డీవో ప్రత్యేకపూజలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): శ్రావణమాసం పురస్కరించుకొని తాండూర్ శివారులోని త్రిలింగేశ్వరాలయంలో ఆదివారం డీఆర్‌డీవో సాయన్న పూజలు నిర్వహించారు. దీంతోపాటు ఆలయ ఆవరణలో మొక్క నాటారు. తొలిసారిగా ఆలయానికి వచ్చిన డీఆర్‌డీవో సాయన్న దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆలయ పూజారి మల్లిఖార్జునప్ప, ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తు, సభ్యులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన సిద్ధరామేశ్వరాలయం



భిక్కనూరు: సిద్దరామేశ్వరాలయం శ్రావణమాసం సందర్బంగా భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, మాత భువనేశ్వరీ దేవికి కుంకుమపూజలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను జరిపించారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

ఘనంగా సరస్వతి యజ్ఞం



కామారెడ్డి రూరల్: ఇల్చిపూర్ శివారులోని సరస్వతీ ఆలయంలో ఆదివారం 480వ సరస్వతి యజ్ఞం ఘనంగా నిర్వహించారు. బొందుగుల పద్మ వెంకటేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ యజ్ఞంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాత పార్శి విఠల్ పటేల్, అర్చకులు దత్తాద్రిశర్మ, విజయ్‌పాండే, సూరజ్ పాండే, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



లింగంపేట(ఎల్లారెడ్డి): అయిలాపూర్‌లో ఆదివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామానికి చెందిన 26 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదానానికి అంగవైకల్యం అడ్డుకాదని ఇద్దరు దివ్యాంగులు చెట్కూరి సాయిలు, బెస్త చింత సాయిలు రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. వారిని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు సన్మానించారు. రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు బొల్లు శ్రీకాంత్ మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్టులు ఉండవని యువతకు అపోహలు తొలగించారు. యువకులు దీక్షిత్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమం పరిశీలన



పొందుర్తి పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి



నస్రుల్లాబాద్‌లో.. నాయబ్ తహసీల్దార్ బావయ్య



బిచ్కుందలో .. ఎంపీడీవో ఆనంద్

రాజంపేట: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఎల్‌వోల ఆధ్వర్యంలో ఆదివారం రాజంపేట మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రచారం చేశారు. ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, పొందుర్తి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించగా తహసీల్దార్ అనిల్ కుమార్ బస్వన్నపల్లి, ఆర్గొండ, అన్నారం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని నాయబ్ తహసీల్దార్ బావయ్య పరిశీలించారు. గ్రామంలో 18 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరు ఓటు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరణించిన వారి ఓటు తొలగించాలని బీఎల్‌వోలకు సూచించారు.

బిచ్కుంద(జుక్కల్): అర్హులైన వారు ఓటు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని ఎంపీడీవో ఆనంద్ అన్నారు. ఆదివారం బిచ్కుందలో ఎంపీడీవో, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆర్ఐ సాయిబాబా, అంగ్‌వాడి టీచర్లు ఉన్నారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ సురేష్ ఆదివారం పరిశీలించారు. అదే విధంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను సైతం ఆయన పరిశీలించారు.

ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణ

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని బంజపల్లి జీపీలో ఆదివారం పంచాయతీ కార్యదర్శి గంగారం ఓటరు నమోదు దరఖాస్తు ఫారం-6 పత్రాలను స్వీకరించారు. ఓటు హక్కు నమోదు దరఖాస్తులతో పాటు ఓటరు జాబితాలో తప్పుల సవరణ చేపడుతున్నామని ఆయన చెప్పారు. నాయకుడు లింగాగౌడ్, కారోబార్ సాయిలు ఉన్నారు.



ఎల్లారెడ్డిలో .. తహసీల్దార్ సురేష్



ఓటరు నమోదు పత్రాన్ని స్వీకరిస్తున్న కార్యదర్శి

ఆశావర్కర్లతో ఓటరు నమోదు

- అవగాహన లేకుండా ఎలా చేయాలని ప్రశ్నిస్తున్న ఆశావర్కర్లు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆశావర్కర్లు

రామారెడ్డి: ఓటరు నమోదు ప్రక్రియను రెవెన్యూ అధికారులు చేసేవారు. వీఆర్వోలు, వీఆర్ఏలు కొత్త ఓటర్ల నమోదు ప్రకియ, తొలగించాల్సిన ఓటర్లను గుర్తించి తొలగించేవారు. ప్రస్తుతం వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడంతో పాటు, వీఆర్ఏలను ఇతర కార్యాలయాల్లో సర్దుబాటు చేశారు. రానున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కొత్తగా ఓటు నమోదు చేసుకునేవారి కోసం ఆదివారం రామారెడ్డిలో ఆశావర్కర్లును బీఎల్వోలుగా నియమించి ఓటర్ ప్రక్రియను నమోదు చేస్తున్నారు. అయితే ఈ విషయంలో తమకు ఎలాంటి శిక్షణ ఇవ్వలేదని, నేరుగా ఓటు నమోదు చేయాలంటే ఎలా చేయాలని ఆశా వర్కర్లు ప్రశ్నిస్తున్నారు. అడ్రస్‌లు మార్చుకోవడం, మరణించిన వారిని ఓటర్ లిస్ట్ నుంచి తొలగించడం, కొత్త ఓటర్‌గా నమోదు చేసుకోవడానికి దరఖాస్తుల స్వీకరించడం ఇబ్బందిగా మారిందని ఆశా వర్కర్లు చెప్తున్నారు.

నాసిరకం పనులపై విపక్ష నేతల ఆగ్రహం



నాసిరకం పనులు చూపుతున్న కాంగ్రెస్ నేతలు

బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్‌లో ఇటీవలే నిర్మించిన సుమారు 200 మీటర్ల పంట కాలువ కూలిపోవడంతో విపక్ష పార్టీల నేతలు ఆదివారం పనులు పరిశీలించి విమర్శలు చేశారు. అధికార పార్టీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి నాసిరకం పనులతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణాల్లో నాణ్యత పాటించకున్నా అటు అధికారులు కానీ ఇటు పాలకులు కానీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వడ్ల శేఖర్, బీజేపీ బాన్సువాడ సెగ్మెంట్ కన్వీనర్ కొత్త కొండ భాస్కర్‌తో కలిసి మాట్లాడారు. అధికార అండతో చేసిన తప్పులు ఎత్తిచూపుతామనే ఉద్దేశంతోనే గతంలో తాము స్ట్రీట్ కార్నర్ మీటింగ్ పెట్టుకుంటే బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారని విమర్శించారు. నేడు ప్రతి చోట నాసిరకం పనులు కనిపిస్తున్నాయన్నారు.

భగవద్గీత పఠనంతో మానసిక వికాసం



భగవద్గీత గురించి బోధిస్తున్న కృష్ణానందస్వామి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): భగవద్గీత పఠనంతో మానసిక వికాసం కలుగుతుందని రామకోటిజప ప్రచారకులు కృష్ణానందస్వామి అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో ఆదివారం భగవద్గీత గురించి భక్తులకు వివరించారు. ప్రతి రోజు భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదవాలని, భగవద్గీతను ఎలా చదవాలో భక్తులకు అవగాహన కల్పించారు.

సమాచారం..

నేడు సామాజిక తనిఖీ

బిచ్కుంద(జుక్కల్): మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. 2020–23లో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీలు చేపడుతున్నామని, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

29న రాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో గల రాజరాజేశ్వరి ఆలయ 7వ వార్షికోత్సవం ఈనెల 29, 30వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు రామారెడ్డి సాయిలు, కార్యదర్శి తోట శంకర్‌లు తెలిపారు.

31న రాఖీ పౌర్ణమి

భిక్కనూరు: రాఖీ పౌర్ణమి పండగను ఈనెల 31న జరుపుకోవాలని వేదబ్రాహ్మణుడు పెద్దెడ్ల శ్రీనివాస శర్మ ఆదివారం తెలిపారు. పౌర్ణమి గురువారం ఉదయం ఎనిమిది గంటల వరకు ఉంటుందని సూర్యోదయానికి పౌర్ణమి ఉన్నందున రాఖీ పౌర్ణమిని, రక్షాబంధనాన్ని కూడా అదే రోజు జరుపుకోవాలని సూచించారు.